

## ఆరంభం అదిరిపోయేలా..

అగ్ర కథానాయకుడు చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. తాజా షెడ్యూల్‌లో చిరంజీవిపై ఉపోద్ఘాత గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. హైదరాబాద్ శంకర్‌పల్లిలో వేసిన భారీ సెట్‌లో ఈ పాట చిత్రీకరణ జరుగుతున్నది. కీరవాణి స్వరపరచిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రచించారు. శోబి మాస్టర్ నృత్య రీతుల్ని సమకూర్చారు. మాస్ బీట్‌తో హుషారెత్తించే పాట ఇదని, చిరంజీవి డ్యాన్స్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఓ దైవకార్యం నెరవేర్చడానికి భువిపై జన్మించిన ఓ వ్యక్తికి, విశ్వంభర అనే లోకానికి మధ్యన ఉండే సంబంధం, కార్యసాధనలో అతను చేసే ప్రయాణం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమేరా: చోటా కె నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, రచన-దర్శకత్వం: వశిష్ట.



## ఓ కొత్తరకం ప్రేమకథ

నటుడిగానే కాక, గాయకుడిగా, పాటల రచయితగా, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞ కనబరుస్తున్నారు తమిళ అగ్రనటుడు ధనుష్. ఆయన దర్శకత్వంలో వచ్చిన పా పాండి, రాయన్ చిత్రాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఈ క్రమంలోనే ఆయన దర్శకత్వంలో రానున్న మూడవ సినిమా 'నిలవక్కు ఎన్ మేల్ ఎన్నాడి కోబమ్'. ఈ తమిళ సినిమా 'జాబిలమ్మ నీకు అంత కోపమా' పేరుతో తెలుగులోనూ ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి సంస్థ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. జాన్వి నారంగ్ మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన ధనుష్‌గారికి థాంక్స్. ఓ కొత్తరకం ప్రేమకథతో రానున్నాం.' అని చెప్పారు. ఇంకా ఈ సినిమాలో నటించిన అనికా సురేంద్రన్, రబియా, వెంకటేష్ మీనన్, రమ్య రంగనాథన్, పవీష్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: లియోన్ బ్రిట్టో, నిర్మాణం: వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌కె ప్రొడక్షన్స్.



## జర్నలిజం నేపథ్యంలో..

ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'నేనెక్కడున్నా. మాధవ్ కోదాడ దర్శకునిగా పరిచయం అవుతున్నాడు. మారుతి శ్యాంప్రసాద్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ చేతుల మీదుగా విడుదల చేశారు. జర్నలిజం విలువలు, మహిళా సాధికారతపై తీసిన ఈసినిమా తప్పక అందరికీ నచ్చుతుందని మేకర్స్ ఎలిపారు. జీతం కోసం కాకుండా జనాల జీవితాలకోసం పాత్రికేయ రంగాన్ని ఎంచుకున్న ఆనంద్, ఝాన్సీల కథ ఇదని, ఈ సినిమాలో వారిద్దరూ చేసే కొన్ని స్టింగ్ ఆపరేషన్స్ వల్ల కొందరు అవినీతి భాగోతాలు బయటపడతాయని, ఆ తర్వాత తాము ఎలాంటి ప్రమాదాలను ఎదుర్కొన్నారు? అనేది మిగతా కథ. మురళీశర్మ, మహేష్ మంజ్రేకర్, ప్రదీప్ రావత్, షయాజీ షిండే, అభిమన్యు సింగ్, రాహుల్ దేవ్, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి తదితరలు నటించిన ఈచిత్రానికి కెమెరా: జయపాన్ నిర్మల, సంగీతం: శేఖర్‌చంద్ర, సమర్పణ: కేవీఆర్ సమర్పణ.

## ప్రేమ పయనంలో..

అంకిత్ కొయ్య, నీలఖి పాత్ర జంటగా నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. వర్ధన్ దర్శకుడు. అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలు. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. ఓ అందమైన ప్రేమకథతో పాటు మిడిల్‌క్లాస్ ఎమోషన్స్‌ను టీజర్‌లో ఆవిష్కరించారు. స్కూటీ చుట్టూ ఈ కథ నడుస్తుందని టీజర్ చూస్తే అర్థమవుతున్నది. కథానాయిక స్కూటీ కావాలని ఎందుకు పట్టుపట్టింది? అది తీసుకున్న తర్వాత ఆమె జీవితంలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయి? అనే ప్రశ్నలతో టీజర్ ఆకట్టుకుంది. నేటి యువత కనెక్ట్ అయ్యే ప్రేమకథా చిత్రమిదని, ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, రచన-దర్శకత్వం: వర్ధన్.





## యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హే చికీతా'

అభినవ్ మణికంఠ, దివిజ ప్రభాకర్, తన్మయి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హే చికిత'. ధన్‌రాజ్ లెక్కల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. అశోక ఆర్ ఎన్ యస్, 'గరుడవేగ' అంజి నిర్మాతలు. శనివారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. టైటిల్‌ను దర్శకుడు అజయ్‌భూపతి లాంఛ్ చేశారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుతామని మేకర్స్ తెలిపారు. పృథ్వీరాజ్, దేవిప్రసాద్, ప్రభాకర్, వీరశంకర్, బలగం సుజాత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: 'గరుడవేగ' అంజి, సంగీతం: చరణ్‌అర్జున్, రచన-దర్శకత్వం: ధన్‌రాజ్ లెక్కల.



## దర్శకులే నన్ను కొత్తగా చూపించాలి

'బ్రహ్మ ఆనందం' సినిమా చూసిన వారంతా మా అబ్బాయి గురించే మాట్లాడుతున్నారు. మీకన్నా మీ అబ్బాయి బాగా చేశాడని మెచ్చుకుంటూ వుంటే తండ్రిగా చాలా సంతోషంగా ఉంది. చాలాకాలం తర్వాత ఓ మంచి పాత్ర చేశాననే సంతృప్తి కలిగింది. ఎప్పుడూ ఒకేరకం పాత్రలు కాకుండా 'రంగమార్తాండ' లాంటి పాత్రలు కూడా చేయాలనుంది. దర్శకులే నన్ను కొత్తగా చూపించే ప్రయత్నం చేయాలి.' అని పద్మశ్రీ డా.బ్రహ్మానందం అన్నారు. ఆయన, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ఆర్వీఎస్ నిఖిల్ దర్శకుడు. రాహుల్ యాదవ్ నక్కా నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడారు. ఈ సినిమాకు వచ్చినన్ని అభినందనలు తన జీవితంలో ఏ సినిమాకూ రాలేదని, నాన్నగారి ప్రోత్సాహం వల్లే ఆ మాత్రం చేయగలిగానని రాజా గౌతమ్ అన్నారు. మౌత్ టాక్‌తో సినిమా దూసుకుపోతున్నదని నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా చెప్పారు. థియేటర్లలో ఆడియన్స్ ఎమోషనల్‌గా ఫీలవుతున్నారని దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ పేర్కొన్నారు.



## నలుగురు యువకుల మ్యూజికల్ జర్నీ

ప్రస్తుతం విజయ్‌దేవరకొండతో 'కింగ్‌డమ్' వంటి భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఇదే బ్యానర్‌లో గౌతమ్ తిన్ననూరి 'మ్యాజిక్' పేరుతో ఓ మ్యూజికల్ డ్రామాను డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సినిమా నుంచి 'డోంట్ నో వై' అనే గీతాన్ని విడుదల చేశారు. ప్రేమ, భావోద్వేగాల కలబోతగా చక్కటి విజువల్స్‌తో ఈ పాట సాగింది. కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించిన ఈ గీతాన్ని అనిరుధ్, ఐశ్వర్య సురేష్ ఆలపించారు. తమ కళాశాల ఉత్సవం కోసం ఓ పాటను స్వరపరచడానికి నలుగురు యువకులు చేసే ప్రయత్నం నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుందని, వారి మ్యూజికల్ జర్నీ భావోద్వేగాల్ని పంచుతుందని చిత్ర బృందం పేర్కొంది. సారా అర్జున్, అన్మోల్ కజాని, ఆకాష్ శ్రీనివాస్, సిద్ధార్థ్ తణుకు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: గిరీష్ గంగాధరన్, ఆర్ట్: అవినాష్ కొల్లా, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచన-దర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

## రెండై ఉన్న ప్రాణాలే ఒకటయ్యాయిలా..



చరణ్‌సాయి, ఉషశ్రీ జంటగా సినిమా 'ఇట్స్ ఓకే గురు'. మణికంఠ.ఎం దర్శకుడు. సురేష్ అనపురపు, బస్వ గోవర్ధన్ గౌడ్ నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'నిలవదే నిలవదే.. ఎదురుగా నా మది.. తపన తెరచాటులో.. తగని ఆరాటమే.. రెండై ఉన్న ప్రాణాలే ఒకటయ్యాయిలా.. నీతో ఉన్న కాలాలే మధురమే..' అంటూ సాగే ఈ గీతాన్ని లక్ష్మీప్రియాంక రాయగా, మోహిత్ రెహ్మానియక్ స్వరపరచగా, సిద్ధార్థ్ మీనన్ ఆలపించారు. ప్రేమభావాలను వ్యక్తపరిచేలా రూపొందిన ఈ మెలోడీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. సుధాకర్ కోమాకుల కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: కడలి సత్యనారాయణ, చైతన్య, కెమెరా, ఎడిటింగ్: సన్నీ.డి, నిర్మాణం: వండర్ బిల్ట్ ఎంటర్టైన్మెంట్స్.

## ఆ ఆలోచన నుంచే కథ పుట్టింది



**కార్తికేయ ఫ్రాంచైజీ, ప్రేమమ్.. ఇప్పుడు 'తండేల్'.. దర్శకుడిగా చందూ మొండేటి పొటెన్షియాలిటీ ఏంటో చెప్పడానికి ఈ నాలుగు సినిమాలు చాలు. పొంతన లేని జానర్లలో సినిమాలు తీసి విజయాలు సాధించిన క్రెడిట్ ఆయనది. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా, చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీవాసు నిర్మించిన 'తండేల్' సినిమా ఈ నెల 7న విడుదలై.. వేగంగా వందకోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో చందూ మొండేటి విలేకరులతో ముచ్చటించారు.**

- వాస్తవిక సంఘటనలతో కూడిన ఈ కాల్పనిక ప్రేమకథకు ప్రేక్షకుల్లో వస్తున్న స్పందన చూస్తుంటే చెప్పలేనంత ఆనందంగా ఉంది. మత్స్యలేశం గ్రామస్థులు పాక్ సరిహద్దుల్లో దొరకడం.. వారి పోరాటం.. తదితర విషయాలు తెలుసుకున్నాక, పాక్ నేపథ్యంలో సినిమా చేద్దామనుకున్నా. కానీ ఆలోచిస్తే.. ఇందులో బ్యూటిఫుల్ ఎమోషన్ ఉంది. ఈ పోరాటానికి ఓ ప్రేమ లేయర్‌ని చుడితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి పుట్టిందే 'తండేల్'. ఈ కథలోని ఎడబాటు, విరహం చాలా ప్రత్యేకం. సమకాలీన సమాజంలో లేని ఎడబాటు, విరహం ఈ కథలో ఉన్నాయి. సాంకేతిక పెరిగిన ఈ కాలంలో కూడా ఒక్కసారి సముద్రంలోకి వెళితే నెలరోజుల పాటు కనిపించని, వినిపించని పరిస్థితి. ఈ పాయింట్ ఎక్సయిటింగ్‌గా అనిపించింది. అందుకే తొలినుంచి దీన్ని ఎమోషనల్ లవ్‌స్టోరీ అంటూనే ప్రమోట్ చేశాం.
- ఇందులోని ప్రతి షాట్ నా బ్రెయిన్ చైల్డ్. నా అవుట్‌పుట్‌లో ముప్పైశాతం ఎమోషన్ సెన్సార్ కారణంగా తగ్గింది. నా టీమ్ కూడా ప్రాణం పెట్టి పనిచేశారు. నా ఆలోచనలను దృశ్యమానం చేయడంలో వారి పాత్రే కీలకం. అరవింద్‌గారు, బన్నివాసు, చైతు, సాయిపల్లవి, దేవిశ్రీ.. ఇలా అంతా కలిసి చేసిన కొలాబరేట్ ఎఫర్ట్ ఈ సినిమా. ముఖ్యంగా దేవిశ్రీ ఈ కథను అర్థం చేసుకున్నట్టు ఎవరూ అర్థం చేసుకోలేదు. ప్రతి సన్నివేశానికీ తన మ్యూజిక్‌తో ప్రాణం పోశాడు. నాగార్జునగారు ఈ సినిమా చూసి 'థ్యాంక్యూ చందు.. వి లవ్ యూ' అని చెప్పడం, 'ఇది ఒక దర్శకుడి సినిమా' అని లెజెండ్రీ డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు పోస్ట్ పెట్టడం నా జీవితంలో గొప్ప ప్రశంసలు. అందరం ఇంతకష్టడి తీసిన ఈ సినిమాను పైరసీ చేశారు అన్న వార్త విన్నవెంటనే గుండెల్లో గునపం దిగినంత బాధేసింది.
- చైతు చాలా సిన్సియర్. ఆయన ఎఫర్ట్ పెట్టి చేశారు కాబట్టే 'తండేల్'కి ఇన్ని ప్రశంసలు. సెట్‌లో ఆయనలో గొప్ప నటుడ్ని చూశా. అందుకే.. 'తెనాలి రామకృష్ణ' అయనతో చేస్తానని ఆడియన్స్‌కి చెప్పాను. ఆయన ఆ పాత్ర చేయగలడు. తెనాలి రామకృష్ణుడిగా ట్రాన్స్‌ఫర్మేషన్ కాగలడు. ఒక దర్శకుడిగా, స్నేహితుడిగా ఆయన ఆ పాత్ర చేయాలని నా కోరిక కూడా. త్వరలో సూర్యగారితో సినిమా చేయబోతున్నా. కథ కూడా చెప్పా. ఆ వివరాలు త్వరలో తెలియజేస్తా. దాని తర్వాత 'కార్తికేయ 3' ఉంటుంది.



## భారతీయ సూపర్ హీరో త్రికాల

శ్రద్ధాదాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'త్రికాల'. మణి తెల్లగూటి దర్శకుడు. రాధిక, శ్రీనివాస్ నిర్మాతలు. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'యుద్ధం రేపటి వెలుగు కోసం, కానీ ఈ అంధకాసురుడి యుద్ధం వెలుగుని నాశనం చేయడానికి..' అంటూ తనికెళ్ల భరణి డైలాగ్స్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. సైక్రియార్టిస్ట్ పాత్రలో కథానాయిక శ్రద్ధాదాస్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకున్నాయి. హాలీవుడ్ సూపర్ హీరోల తరహాలో సాగే కథాంశమిదని, కాలంతో సంబంధం లేకుండా ప్రజలను కాపాడేవాడే త్రికాల అని, మన సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలియజెప్పాలనే లక్ష్యంతో ఈ సినిమా తీశానని నిర్మాత రాధిక పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: షాజిత్ హుమాయున్, హర్షవర్ధన్ రామేశ్వర్, రచన, ఎడిటర్, దర్శకత్వం: మణి తెల్లగూటి.

## ఓ రాత్రి ఏం జరిగింది?



పూర్ణ, త్రిగుణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డార్క్ నైట్'. జీఆర్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెన్సార్‌కు సిద్ధమవుతున్నది. శుక్రవారం అగ్ర దర్శకుడు వి.వి.వినాయక్ టీజర్‌ను విడుదల చేశారు. 'సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. పూర్ణ పాత్ర భిన్న కోణాల్లో సాగుతుంది. నాలుగు పాత్రల చుట్టూ నడిచే ఈ కథలోని అనూహ్య మలుపులు ప్రేక్షకుల్ని ఉత్కంఠకు గురిచేస్తాయి. ఓ రాత్రి చోటుచేసుకునే ఘటనలు థ్రిల్‌కి గురిచేస్తాయి. మార్చి నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మిస్కిన్, కథ, దర్శకత్వం: జీఆర్ ఆదిత్య.





